విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 190 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/-

## వీలైనంత త్వరగా ట్రిపుల్ ఆర్

# భూసేకరణ



- నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్‌లో త్వరగా పూర్తి
- అటవీ, ఆర్ అండ్ బి అధికారులతో సమన్వయం
- రెండు శాఖల్లో ఒక్కో అధికారి నియామకం
- ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బిటి రోడ్డు
- రీజినల్ రింగ్ రోడ్డుపై సమిక్షలో సీఎం రేవంత్



ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బిటి రోడ్డు

హైదరాబాద్,

రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ పక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ కోసం జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ పక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.సచివాలయంలో ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ, రాష్ట్ర రహదారులపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. భూ సేకరణపై అటవీ శాఖ పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని -మిగతా 3 లో



## ఢిల్లీపై ప్రధాని వరాల జల్లు

రూ. 4,500 కోట్ల విలువైన వివిధ పథకాల ప్రారంభం

న్యూఢిల్లీ,

ఢిల్లీ రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ నేడు రూ.4,500 కోట్ల విలువైన వివిధ పథకాలను కానుకగా అందించనున్నారు. ప్రధాని మోదీ శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, శంకుస్థాపన చేసారు. 'అందరికీ హౌసింగ్' ప్రతిజ్ఞలో భాగంగా, ఢిల్లీలోని అశోక్ విహార్‌లోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్‌లో ఇన్-సిటు స్లమ్ రిహాబిలిటేషన్ ప్రాజెక్ట్ కింద మురికివాడల కోసం నిర్మించిన -మిగతా 3 లో



## రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ బొంద పెట్టింది

- రైతుబంధు రూపంలో రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదు
- 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు కేసీఆర్
- రైతులు యాచించాలని రేవంత్‌రెడ్డి కుట్ర : కేటీఆర్

హైదరాబాద్,

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని బొంద పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులు యాచించాలని రేవంత్ రెడ్డి అంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో -మిగతా 3 లో



## నేను ఎలా జీవిస్తున్నానో ప్రజలకు తెలుసు

- కావాలంటే అద్దాల మేడలో ఉండేవాడ్ని : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,

మోదీ తన కోసం ఏమీ నిర్మించుకోలేదన్న విషయం ఈ దేశ ప్రజలకు తెలుసు అని, కానీ పేద ప్రజల కోసం మాత్రం నాలుగు కోట్ల ఇళ్లు నిర్మించినట్లు ప్రధాని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నేను కూడా అద్దాల మేడ కట్టుకునేవాడిని అంటూ ఆమ్ ఆద్మీ పార్టీని ఆయన విమర్శించారు. ఇటీవల నిర్మించిన ఢిల్లీ సీఎం నివాసం కోసం భారీ మొత్తంలో ఖరీదైన వస్తువులను -మిగతా 3 లో


## అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారు

- పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్ల మొసలి కన్నీళు
- బిసి బిడ్డ ఈటెల రాజేందర్‌ను మెడపట్టి గెంటారు
- కవిత బిసి డిక్లరేషన్‌పై మంత్రి పొన్న ప్రభాకర్ ఎద్దేవా



హైదరాబాద్,

అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారని...పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్ల మొసలి కన్నీళ్లు పెట్టుకుంటున్నారని...బిసి బిడ్డ ఈటెల రాజేందర్‌ను మెడపట్టి గెంటిన విషయం మరచి పోయారన,కవిత బిసి డిక్లరేషన్‌పై మంత్రి పొన్న ప్రభాకర్ ఎద్దేవా చేశారు. బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బీసీల కోసం మాట్లాడుతున్నందుకు సోదరి కవితకి -మిగతా 3 లో



## మెడికల్ సీట్లు ఖాళీగా ఉండడానికి వీల్లేదు

రాష్ట్రాలకు సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ,

వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లు ఖాళీగా ఉండటానికి వీల్లేదని ,మెడికల్ సీట్లకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని -మిగతా 3 లో




## మరింత ఆలస్యంగా మంత్రివర్గ విస్తరణ

హైదరాబాద్,

రాష్ట్రంలో మంత్రి వర్గ విస్తరణ ఆరడుగులు ముందుకు, మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రజా పాలన పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరం పూర్తయినా మంత్రి వర్గ విస్తరణ చేపట్టడం లేదు. కీలకమైన శాఖలు సీఎం రేవంత్ రెడ్డి వద్దే -మిగతా 3 లో

## ఇది ప్రజాప్రభుత్వం కాదు..కోతల ప్రభుత్వం



- రైతు భరోసాపై మరోమారు మోసం చేసే యత్నం
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,

ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదు మాటల ప్రభుత్వం, కోతల ప్రభుత్వమని మండిపడ్డారు. రైతు భరోసా లో కోతలు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు ఎందరు ప్రభుత్వం దగ్గర డేటా ఉందని, దద్దమ్మ ప్రభుత్వం రైతుల నుండి -మిగతా 3 లో

# ట్రంప్ రాకకకు ముందే అనేక డిమాండ్లు

**-ఓపిటిపై అప్పుడే మొదలైన ఆందోళనలు**



వాషింగ్టన్,
ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వకరించడానికి ముందే అనేక అంవాలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. ఇందులో వీసాలు మొదలు, ఓపిటి వరకు చర్చకు తెరతీసాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ విద్యార్థులు పని అనుభవం సంపాదించేందుకు వాడే ది ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌కు ముగింపు పలకాలన్న ఒత్తిడి పెరుగుతోంది. అమెరికన్లకు లభించాల్సిన జాబ్స్‌ను ఈ ప్రోగ్రాం కింద వచ్చిన విదేశీ విద్యార్థులు ఎగరేసుకుపోతున్నారనే ఆందోళనలు తీవ్రమయ్యాయి. సంప్రదాయ మార్గాలను బైపాస్ చేసి.. దీర్ఘకాలిక వలసలకు కూడా దీనిని విద్యార్థులు వాడుకొంటున్నారనే విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి ఓపీటీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వినియోగిస్తారు. దీనికింద ఎఫ్-1 వీసా ఉన్న విద్యార్థులు స్టెమ్ డిగ్రీ పూర్తి చేస్తే అమెరికాలో మూడేళ్లపాటు పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమానికి ఆ దేశ కాంగ్రెస్ అనుమతి
లేదని విమర్శకులు తరచూ ప్రస్తావిస్తుంటారు. అంతేకాదు.. ఈ విద్యార్థులు అమెరికన్ స్టూడెంట్లతో కలిసి ఉద్యోగాల కోసం పోటీపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అమెరికా జాబ్ మార్కెట్‌కు దీన్ని దొడ్డిదారిగా అభివర్ణిస్తుంటారు. అమెరికా టెక్ వర్కర్స్ గ్రూప్ ఈ ప్రోగ్రామ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 'ఓపీటీకి అతిథి ఉద్యోగుల స్కీమ్. దీనికి విదేశీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ అనే ముసుగు వేశారు. విశ్వవిద్యాలయాలు చదువుకు బదులు వర్క్‌పర్మిట్లను విక్రయిస్తున్నాయి. ట్రంప్ అమెరికాను రక్షించేందుకు, ఇక్కడి విద్యార్థులకు ఎదురయ్యే అన్యాయమైన పోటీని తొలగించేందుకు.. ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌ను ముగించాలని కోరింది. ఇప్పటికే వాషింగ్టన్ అలయన్స్ ఆఫ్ టెక్నాలజీ వర్కర్స్ ఓపీటీపై 2023లో కోర్టును ఆశ్రయించింది. ఇది అమెరికా ఉద్యోగులకు హాని చేస్తోందని ఆరోపించింది. కానీ, కింది కోర్టు మాత్రం ఈ ప్రోగ్రామ్‌ను సమర్థించింది. మరోవైపు కొందరు చట్టసభ సభ్యులు అసలు ఈ కార్యక్రమాన్నే రద్దు చేయించేందుకు సన్నద్ధమవుతున్నారు. భారత విద్యార్థులు వృత్తిపరమైన అవకాశాలు.. హెచ్1బీ వీసాల కోసం ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌పైనే ఆధారపడతారు. ఇప్పుడు ట్రంప్ వచ్చాక దీనిపై సమీక్షిస్తే నష్టపోయేది భారతీయ విద్యార్థులే.

# హాస్టల్ వ్యవహారంపై ముమ్మర దర్యాప్తు

**-వేలిముద్రలు సేకరించిన పోలీసులు**
**-ఆందోళనలతో విద్యార్థినుల తల్లిదండ్రులు**



మేడ్చల్,
మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలో వసతిగృహ స్నానాల గదిలో వీడియోలు చిత్రీకరించారంటూ విద్యార్థినులు చేసిన ఆరోపణలపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. కాగా హాస్టల్ బాత్‌రూమ్‌లో సీసీ కెమెరాల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. విద్యార్తినుల తల్లిదండ్రులు ఇక్కడకు చేరుకోవడంతో ఆందోళన తీవ్రం అయ్యింది. తమ పిల్లల భవిష్యత్ ఏం కానుందో అన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హాస్టల్ వార్డెన్ సహా ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వారి వేలిముద్రలను దర్యాప్తు బృందం సేకరించింది. మరోవైపు కళాశాలకు యాజమాన్యం మూడు రోజులపాటు సెలవులు ప్రకటించింది. వసతిగృహ స్నానాల గది వెంటిలేటర్ నుంచి తమను వీడియో తీశారంటూ మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ కళాశాల ఐటీ క్యాంపస్ విద్యార్థినులు బుధవారం ఆందోళనకు దిగగా ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు, బీజేవైఎం నేతలు మద్దతు పలకడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. యాజమాన్యానికి నోటీసు జారీ చేసింది. కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ వసతిగృహానికి వచ్చి విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. గర్ల్స్ హాస్టల్‌లో అమ్మాయిల ప్రైవేట్ వీడియోలు ఆగంతకులు తీశారని ఫిర్యాదు వచ్చాయి. ఇప్పటికే హాస్టల్ వార్డెన్‌తో సహా ఏడుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పలు ఫింగర్ ప్రింట్‌లను కూడా పోలీసులు సేకరించారు. ఫింగర్ ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆడపిల్లల వీడియోలు బయటకి పోతాయేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫోరెన్సిక్ నుంచి వచ్చే రిపోర్ట్‌పైనే ఈ కేసు ఆధారపడి ఉంది. తాము స్నానం చేస్తుండగా వీడియోలు తీశారని.. బాత్ రూమ్‌లల్లో కెమెరాలు పెట్టారంటూ విద్యార్థినిలు ఆందోళన బాట పట్టారు. గత రెండు రోజులుగా విద్యార్థినిలు నిరసనకు దిగారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోవైపు విద్యార్థినిల ఆందోళనకు ఎన్ఎస్‌యూఐ నాయకులు మద్దతు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు కూడా సీఎంఆర్ కాలేజ్ ప్రాంగణానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మరోవైపు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస రెడ్డి అక్కడకు చేరుకుని విద్యార్థినిలతో మాట్లాడారు. ఆందోళనను విరమించాలని కోరారు. అయితే తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనను విరమించేది లేదని విద్యార్థినులు స్పష్టం చేశారు.

# లద్దాఖ్‌లోని సరిహద్దుల్లో చైనా స్థావరాలు

**-తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్**



న్యూఢిల్లీ,
లద్దాఖ్‌లోని సరిహద్దు ప్రాంతంలో చైనా రెండు స్థావరాలను ఏర్పాటు చేయడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో చైనా ఆక్రమణలను ఎన్నడూ అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఇటువంటి చట్ట విరుద్ధ, బలవంతపు ఆక్రమణలు చేయడం వల్ల వాటికి చట్టబద్ధత కల్పించినట్లు కాదని పేర్కొంది. ఇదే అంశంపై దౌత్యమార్గాల ద్వారా చైనాకు తమ నిరసన వ్యక్తం చేసినట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. 'చైనాలోని హోటాన్ ప్రాంతంలో కొత్తగా రెండు కౌంటీల నిర్మాణానికి సంబంధించిన ప్రకటన చూశాం. ఈ కౌంటీల్లో కొంత భాగం లద్దాఖ్ పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని ఎన్నడూ అంగీకరించం. ఈ కొత్త కౌంటీల ఏర్పాటు అనేది ఈ ప్రాంతంలో భారత్‌కు దీర్ఘకాలంగా, స్థిరంగా ఉన్న సార్వభౌమాధికారంపై ఎటువంటి ప్రభావం చూపదు. ఇలా చట్టవిరుద్ధమైన, బలవంతపు ఆక్రమణలతో చట్టబద్ధత లభించదని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ డామ్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో భారత్ తొలిసారి స్పందించింది. దీనిపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది.

# కుంభమేళాకు ప్రత్యేక వెబ్‌పేజీ



న్యూఢిల్లీ,
జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. కుంభమేళా నేపథ్యంలో ప్రత్యేక వెబ్‌పేజీని రూపొందించినట్లు తెలిపింది.

# నటుడు అల్లు అర్జున్‌కు ఊరట

**సంధ్యా థియేటర్ ఘటనలో రెగ్యులర్ బెయిల్ మంజూరు**



హైదరాబాద్,
సినీనటుడు అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియగా.. నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. రూ.50వేలు, రెండు పూచీకత్తులను సమర్పించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది.
'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయన్ను జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో అల్లు అర్జున్ విడుదలయ్యారు.మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అదే రోజు అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది.

# తెలంగాణలో పెరిగిన చలితీవ్రత

**-ఆదిలాబాద్‌లో 7.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత**



హైదరాబాద్,
తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తుండటంతో చలి తీవ్రత మరింత పెరిగిందని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీలకు పడిపోయిందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ‍రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యంత కనిష్ఠంగా హెచ్‌సీయూలో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్‌ఈఎల్ వద్ద 8.8, రాజేంద్రనగర్‌లో 9.4, మౌలాలీలో 9.6, శివరాంపల్లిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ప్రజలు చలికి వణికిపోయారు. శుక్రవారం రాత్రి కూడా ఇలాగే ఉంటుందని, ఉష్ణోగ్రతలు అతి తక్కువకు పడిపోతాయని వాతావరణ శాఖ తెలిపింది.

# చైనాలో మరో వైరస్ వ్యాప్తి

**-ఆస్పత్రులకు క్యూ కట్టిన జనం**

న్యూఢిల్లీ,
చైనాలో మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని, ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల ఎదుట క్యూ కట్టారంటూ వస్తోన్న వార్తలు మరోసారి ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. 2001లోనే గుర్తించిన హ్యూమన్ మెటానిమోవైరస్... ప్రస్తుతం డ్రాగన్ దేశంలో వెలుగు చూస్తోన్న కేసులకు ఓ కారణం. చైనా ఉత్తర ప్రాంతంలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఆసియా దేశాలు కూడా దీనిపై దృష్టిసారించాయి. హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీనిబారిన పడే అవకాశాలు ఎక్కువని అంటున్నారు.

# వీలైనంత త్వరగా ట్రిపుల్ ఆర్ భూసేకరణ

(మొదటి తరువాయి)

తెలిపారు. అటవీ, ఆర్అండ్బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, రెండు శాఖలు ప్రత్యేక అధికారులను నియమించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని రోడ్డు వెడల్పు ఉండేలా డిజైన్ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం విడతల వారీగా నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. నాగ్ పూర్-విజయవాడ కారిడార్‌కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అటవీశాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని,రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ఇందుకు ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. రెండు శాఖలు సమావేశమై సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామం నుంచి మండల



కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండే విధంగా డిజైన్ చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలతో సహా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాల్సిందేనని ఆదేశించారు. ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక ఏ గ్రామానికి రోడ్డు లేదనే మాట వినబడొద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు.

# రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ బొంద పెట్టింది

(మొదటి తరువాయి)

మాట్లాడారు..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజు చేయాలని, వ్యవసాయాన్ని స్థిరికరించాలని, ఎవరూ ఆలోచించని విధంగా విప్లవాత్మకమైన పథకానికి రూపకల్పన చేశారు. రైతుల మీద ప్రేమ ఉండే నాయకుడు కాబట్టి.. కేసీఆర్ రైతుకు పెట్టుబడి ఇవ్వాలని ఆలోచన చేశారు. దాన్ని అమలు చేశారు. ఒకసారి కాదు.. వరుసగా 11 సీజన్లకు దరఖాస్తు, దండం పెట్టే అక్కర్లేకుండా.. నేరుగా వారి ఖాతాల్లో నిధులు జమ చేశారు. రూ. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు కేసీఆర్. 12వ సీజన్ వేసేందుకు పైసలు జమ చేశాం. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఉత్తరం రాసి



ఆపారు అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది దాటిపోయినా రైతుబంధు రూపంలో రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదు. 12వ సీజన్ కింద రూ. 7500 కోట్లు మేమే వేసేటోళ్లం. మేం దాచిపెట్టిన రూ. 7500 కోట్లను వాళ్లు రైతుల ఖాతాల్లో వేశారు. కొత్తగా ఇవ్వకపోగా.. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట బిల్డప్ ఇచ్చారు. రైతులను రాజులను చేస్తాం అని రాహుల్ గాంధీ చేత ఉపన్యాసాలు ఇప్పించారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ, బోనస్ రూ. 500, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్నారు. ఇది రైతు డిక్లరేషన్ వాగ్దానాలు అని కేటీఆర్ గుర్తు చేశారు.

# అధికారమత్తు దిగడంతో ప్రజలు గుర్తుకొస్తున్నారు

(మొదటి తరువాయి)

అభినందనలు అని అన్నారు. నాయకత్వం మధ్య గ్యాప్ ఉందనే కవిత మీటింగ్ పెట్టారని వ్యాఖ్యలు చేశారు. కవిత గతంలో బతుకమ్మ, తర్వాత జాగృతి ఇప్పుడు బీసీ నినాదం అందుకున్నారన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..కొందరికి అధికారం మత్తు దిగి మస్తు గుర్తుకొస్తాయంటూ సెటైర్ విసిరారు. బీఆర్ఎస్ తమ పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశమివ్వాలన్నారు. పార్టీ ఓనర్లలో తాను ఒకడిని అని ఈటెల రాజేందర్ అన్నందుకు మెడలు పట్టి బయటకి పంపారని విమర్శించారు. కవిత చేసే పనికి కొంత సంతోషం, కొంత బాధ కలుగుతోందన్నారు. పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్లు ఈరోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకుండా తొక్కి పెట్టిన వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మా పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయమైతే పార్టీలో చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగితే మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. బీసీల శక్తి గుర్తించారు కాబట్టే కవిత బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కవిత మీటింగ్‌కు జనాల కోసం బ్రతిమాలాడుతున్నారని సెటైరికల్ కామెంట్స్ చేశారు. న్నికల సమయంలో తప్పా బీఆర్ఎస్ బీసీల కోసం ఏమైనా చేసిందా అని నిలదీశారు. ప్రగతి భవన్‌కు జ్యోతి రావ్ పూలే పేరు పెట్టుకున్నామని.. సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా టీచర్ల దినంగా ప్రకటించామని తెలిపారు. కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరెంతో వారికి అంత అని రాహుల్ గాంధీ చెప్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీసీలను ఉపయోగించుకుంటే ఊరుకోమని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# ఇది ప్రజాప్రభుత్వం కాదు.. కోతల ప్రభుత్వం

(మొదటి తరువాయి)



దరఖాస్తులు ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. ఫసల్ భీమా ఊసే లేదు.. రైతు భరోసా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. రైతుల మీద అక్రమ కేసులు పెట్టీ? రైతులకు సంకెళ్లు వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, అప్పుడు బీఆర్ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వేస్తుంది సంకెళ్ళు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులకు అండగా ఉందని, నవంబర్ 30 న నాలుగో విడత రుణమాఫీ చేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు కిషన్ రెడ్డి. ఆ డబ్బులు ఇంకా రైతుల అకౌంట్ లలో చేరలేదని, ఇంకా నాలుగు సంవత్సరాలు అయిన రుణమాఫీ కాదని ఆయన సెటైర్లు వేశారు. కనీస మద్దతు ధర కొన్ని పంటల మీద 80 శాతం మోడీ ప్రభుత్వం పెంచిందని, కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా.. ధాన్యం కొనుగోలు లో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందింది? ఇది నేరపూరిత చర్య అని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రైవేట్ రైస్ మిల్లర్ లతో ఒప్పందం కుదుర్చుకుని రైతులకు అన్యాయం చేస్తుందని, రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. ఈ ప్రభుత్వానికి అధికారుల మీద అజమాయిషీ లేదా అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# మరింత ఆలస్యంగా మంత్రివర్గ విస్తరణ

(మొదటి తరువాయి)



ఉండటంతో పాలన పడకేసింది. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో గురుకులాల పరిస్థితి దారుణంగా మారింది. సరైన పర్యవేక్షణ, పాలన వైఫల్యంతో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారు. కాగా, గత కొన్ని నెలలుగా విస్తరణపై కొనసాగుతున్న ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అయితే విస్తరణ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. డిసెంబరు ఆఖరులోగా జరిగే అవకాశం ఉందంటూ మంత్రులు సైతం ప్రకటనలు చేయడం.. అధిష్ఠానంతో చర్చలు.. విస్తరణ ఉంటుందని అంతా భావించినా, తాజా పరిణామాలను బట్టి అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉండటం, ఈ నెల మూడో వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం విదేశీ పర్యటనకు వెళ్లటం, ఆ తర్వాత ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనవరిలో మంత్రివర్గ విస్తరణకు అవకాశాలు తక్కువేనని కాంగ్రెస్ ముఖ్యనేతలు అభిప్రాయపడుతున్నారు. దీంతో పార్టీ కోసం పని చేసిన ఆశావహులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రతి పనికి ఢిల్లీ అధిష్టానంపై ఆధారపడటంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పాలన పడకేయడంతో ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు. 5

# ఢిల్లీపై ప్రధాని వరాల జల్లు

(మొదటి తరువాయి)

కొత్త ఎ÷-లాట్‌లను ప్రధాని మోదీ శుక్రవారం సందర్శించారు. ఢిల్లీలో ర్యాలీకి ముందు ప్రధాని మోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ఢిల్లీ ప్రజలకు మెరుగైన అవకాశాలు, నాణ్యమైన జీవితాన్ని అందించాలనే మా అచంచలమైన నిబద్ధత ఈ రోజు ప్రారంభించబడుతున్న ప్రాజెక్టులలో ప్రతిబింబిస్తుందని రాసుకొచ్చారు. ఢిల్లీలోని అశోక్ విహార్‌లో మురికివాడల కోసం కొత్తగా నిర్మించిన 1,675 ఫ్లాట్‌లను ప్రధాని మోడీ ప్రారంభించి, అర్హులైన లబ్దిదారులకు స్వాభిమాన్ అపార్ట్‌మెంట్ల తాళాలను అందజేసారు. కొత్తగా నిర్మించిన ఎ÷-లాట్‌ల ప్రారంభోత్సవం ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా రెండవ విజయవంతమైన ఇన్-సిటు స్లమ్ పునరావాస ప్రాజెక్ట్‌ను పూర్తి చేసింది. ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం ఢిల్లీలోని మురికివాడల నివాసులకు తగిన సౌకర్యాలతో మెరుగైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం. ఇక ఎ÷-లాట్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు వెచ్చించగా.. అర్హులైన లబ్దిదారులు మొత్తం సొమ్ములో 7 శాతం లోపే చెల్లించనున్నారు. అలాగే ఢిల్లీ యూనివర్శిటీలో రూ.600 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో మూడు కొత్త ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఇది తూర్పు ఢిల్లీలోని సూరజ్మల్ విహార్ లోని తూర్పు క్యాంపస్‌లో ఒక అకడమిక్ బ్లాక్, ద్వారకలోని పశ్చిమ క్యాంపస్‌లో ఒక అకడమిక్ బ్లాక్‌ని కలిగి ఉంటుంది. అలాగే నజఫ్‌గఢ్‌లోని రోషన్‌పురాలోని వీర్ సావర్కర్ కళాశాల భవనం కూడా ఉంది. వీటిలో విద్య కోసం అత్యాధునిక సౌకర్యాలు కల్పించనున్నారు.

# నేను ఎలా జీవిస్తున్నానో ప్రజలకు తెలుసు

(మొదటి తరువాయి)



వాడారు. దానిపై ఆరోపణలు వస్తున్నాయి. పబ్లిక్ వర్క్స్ శాఖ రిలీజ్ చేసిన ఇన్వెంటరీలో విస్తుపోయే లెక్కలు ఉన్నాయి. సీఎం బంగ్లా కోసం చాలా హైఎండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల్ని వాడినట్లు ఉన్నది. దీంతో బీజేపీ, ఆమ్ ఆద్మీ మధ్య రాజకీయ వేడి చెలరేగింది. గత పదేళ్ల నుంచి ఢిల్లీని ఆపద చుట్టేసిందని, అన్నాహజారేను ముందు పెట్టి, కొందరు నిజాయితీలేని వాళ్లు ఢిల్లీని ఆపదలోకి నెట్టేశారని, ఆప్ పార్టీ.. ఢిల్లీపై ఆపదలా పడి, మొత్తం దోచేసుకుంటోందని ప్రధాని విమర్శించారు. రాజకీయ, ఆర్థిక స్థిరత్వానికి ఇండియా సింబల్‌గా మారిందన్నారు. 2025లో భారత పాత్ర మరింత బలపడిందన్నారు. ఈ ఏడాది ప్రపంచ పట్టికలో ఇండియాను మరింత ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. ఇండియాను అతిపెద్ద ఉత్పత్తి దేశంగా మార్చాలన్నారు. ఢిల్లీ అభివృద్ధికి ఇది చాలా ముఖ్యమైన రోజు అని ప్రధాని మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు. జుగ్గి-జోప్రి అర్బన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు చెందిన 1675 ఫ్లాట్లను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. అశోక్ విహార్ ఏరియాలోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్‌లో నిర్మించిన ఈబ్ల్యూఎస్ ఫ్లాట్లకు చెందిన లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు.

# మెడికల్ సీట్లు ఖాళీగా ఉండడానికి వీల్లేదు

(మొదటి తరువాయి)



కేంద్రాన్ని ఆదేశించింది. దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. వైద్య విద్యకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా సీట్లు ఖాళీగా ఉండటంపై ఏప్రిల్ 2023లో సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ వైపు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వైద్యుల కొరత ఉండటం, మరోవైపు ఇలా సీట్లు మిగిలిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు, ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రతినిధులతో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తాజాగా కొన్ని సిఫార్సులు చేయడంతో ఇదే విషయాన్ని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ అంశానికి సంబంధించిన పిటిషన్‌ను నేడు విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. మెడికల్ సీట్లు ఖాళీగా ఉండకూడదని స్పష్టం చేసింది. వివిధ భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఓ కచ్చితమైన ప్రతిపాదనతో వస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించిన న్యాయస్థానం.. మూడు నెలల్లో పూర్తి చేయాలని పేర్కొంటూ తదుపరి విచారణ ఏప్రిల్‌లో చేపడతామని తెలిపింది. 3

## సంపాదకీయం


# పథకాల అమలు పక్కాగా సాగాలి

పథకాలు ఏవైనా ఓటు బ్యాంక్‌తో కాకుండా..ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించి కొనసాగించాలి. అవసరం మేరకే పథకాలను ప్రవేశ పెట్టడం జరగాలి. అలా జరిగినప్పుడే వాటికి సార్ధకత ఉంటుంది. కొత్తగా రేషన్ కార్డుల మంజూరు, రైతుభరోసాకోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా మళ్లీ రేషన్ కార్డులు ఇస్తామని కూడా అంటున్నారు. ఇప్పటికే జనాభాను మించి పేద కుటుంబాలను గుర్తించి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ధరలు పెరిగిన నేటి కాలంలో కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఎపిలో వేలకోట్ల రూపాయల బియ్యం పక్కదారి పట్టాయి. గోడౌన్ల నుంచే మాయం అయ్యాయి. నేతలే సూత్రధారులుగా మారి పక్కదారి పట్టించారు. ఇలాంటి సమయంలో తెలుగు రాష్ట్రాల్లో బియ్యం పథకాన్ని తక్షణం సమీక్షించాలి. వ్యాపారంగా మారిన చౌకబియ్యం ధరలను పెంచాలి. అలాగే పేదలను గుర్తించి వారికి మాత్రమే బియ్యం అందేలా చేయాలి. దీంతో ఖజానకు వేలకోట్లు ఆదా అవుతాయి. దీనిని సంస్కరించకుండా పోరాదు. ఉచిత విద్యుత్ కూడా సక్రమంగా పొలాలకు వెళ్లేది లేనిది లెక్క కట్టాలి. రైతుభరోసా కూడా కేవలం పంటలు వేసే వారికి అందాలి. ఈ పథకాలను పక్కాగా లెక్కలు తీసి అమలు చేయాలి. అప్పుడు వేలకోట్లు ఆదా కావడంతో ఖజనాకు భారం తప్పుతుంది. రైతుభరోసాకు సంబంధించి త్వరలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించదిం, రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది. సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. అలాగే, రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఇదే సందర్భంలో రేషన్ బియ్యం, ఉచిత విద్యుత్ పొందుతున్న రైతుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకోవాలి. ఇక్కడే ఎవరు పేదో..ఎవరు కాదో తెలుస్తుంది. గ్రామాల్లో ఎవరెవరు ఉచితంగా పథకాలు అప్పనంగా పొందుతున్నారో క్షేత్రస్థాయి అధికారులకు తెలుసు. పక్కాగా వీటిని అమలు చేయడంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. రైతుభరోసా కోసం అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించాలనుకోవడం మంచిదే. గతంలో లాగా ఎవరికి పడితే వారికి రైతుభరోసా పేరుతో దుబారా చేయకపోవడం మంచిదే. ఇది పంటలు పండించే రైతులకు కూడా ధైర్యం ఇచ్చేది కానుంది.

జనవరి 5 నుంచి 7 వరకు రైతు భరోసా దరఖాస్తులు స్వీకరించే అవకాశముందని, సంక్రాంతి పండుగ తర్వాత సర్కార్ రైతు భరోసాను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న వేళ... ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిందే. కేబినెట్ భేటీలో రైతు భరోసాకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నందున వివరాలు సేకరించడంలో తప్పలేదు. గత ప్రభుత్వం ఒక కోటీ 53 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చింది. గుట్టలు, వెంచర్లు, సాగుచేయని భూములకు కూడా గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు అలా కాకుండా కేవలం సాగు చేసే భూములకు రైతు భరో సా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ధరణి పోర్టల్ రికార్డుల ప్రకారం ఒకకోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో సాగుచేసే భూమి కోటి 30 లక్షలు ఎకరాలుగా ప్రభుత్వం గుర్తించింది. కేవలం ఈ భూ ములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ విస్తీర్ణం 1,12,000 చదరపు కిలోమీటర్లు... అంటే దాదాపు 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూమి. దీనిలో కోటీ 60 లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి, 66 లక్షల ఎకరాలు అటవీ భూమి, మిగిలినవి గ్రామకంఠాలు, పట్టణాలు, దేవాలయ మాన్యాలు, వక్ఫ్, ఇనాం, శిఖం కింద ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కూడా ఉజ్జాయింపు లెక్కలే కానీ, వాస్తవమైన రుజువులు చేయగలిగే స్పష్టమైన లెక్కలు లేవు. దీని కోసం ఎంత కష్టమైనా పొజిషన్ ప్రకారం సమగ్ర భూసర్వే చేసి తీరాలి. భూమికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు కార్యాచరణ సాగాలి. అన్యాక్రాంతం, కబ్జా అయిన ప్రభుత్వ భూముల రక్షణ తో పాటు దేవాదాయ భూములను కూడా రక్షించాలి. ఇందుకోసం ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయాలి. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో అవతవకలు జరిగాయని గుర్తించినందున సరిదిద్దే పనిలో పారదర్శకంగా, పక్కాగా పనిచేయాలి. నిజానికి తెలంగాణ భూ సమాచారం విషయంలో దాపరికాలు ఏమీ ఉండవు. ఏ ఊరిలోకి వెళ్లినా, ఈ భూమి ఎవరిది అని అడిగినా... పూర్తి సమాచారాన్ని ప్రజలు నోటితో చెప్పేస్తారు. అటువంటి తెలంగాణలో భూ విషయంలో రహస్యం చేయడం వెనక ఉన్న మతలబు ఎవరికీ అర్థం కాలేదు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా, నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ, నిపుణుల నుండి మరికొన్ని సూచనలు, సలహాలు తీసుకొని తెలంగాణ రైతాంగ సమస్యలను తీర్చేందుకు, సులువైన మార్గాలను పొందుపరిచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమాత పనిచేస్తే రైతులకు గొప్ప భరోసా కల్పించినట్లే అవుతుంది. ఈ క్రమంలోరైతు భరోసా సాయం మీద కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికి రైతుబంధు ఇచ్చింది. కొండలు, గుట్టలు, ఫామ్‌హౌస్‌లు, కంచెలకు కూడా డబ్బులిచ్చింది. ఈ ప్రభుత్వం కేవలం వ్యవసాయానికి మాత్రమే సాయం అందించాలనే దృఢమైన లక్ష్యంతో ఉన్నది. ప్రతి గ్రామంలోని విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, శాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సాయం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నా తీరు అభినందనీయం. ఈ క్రమంలో విద్యుత్ వాడకం, చౌకబియ్యం సరఫరాలపైనా దృష్టి పెడితే మంచిది.

# ప్రగతికీ జమిలికీ కుదరని బంధం!

ప్రయోజనాలను ఆశించని ఆదర్శాలను ఊహించలేం. . రాజకీయాల్లో ఇది మరింత నిజం. ఆదర్శాల కోసమే రాజకీయాలు నడుపుతున్నామని చెప్పే వారి మాటలను పట్టిపట్టి చూడకపోతే అసలు సంగతులు అర్థంకావు. ప్రయోజనం ఆశించినంత మాత్రాన అన్ని ఆదర్శాలకూ స్వలాభమే పరమార్థమనీ చెప్పలేం! ప్రతి ఆదర్శం వెనకనున్న ప్రయోజనాన్ని నిర్దిష్టంగా చూస్తేనే దాని అసలు స్వభావం బయటపడుతుంది. అందుకే ఫలానా ఆదర్శం ఎవరికోసం? సమాజాన్ని అది ముందుకు నడిపిస్తుందా? వెనక్కి నడిపిస్తుందా? ప్రజల హక్కులను బలోపేతం చేస్తుందా? బలహీనం చేస్తుందా? అన్న ప్రశ్నలే ఏ ఆదర్శం విశ్లేషణలోనైనా కీలకపాత్రను పోషిస్తాయి. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయనున్న జమిలి ఎన్నికల ఆదర్శాన్ని ఈ కోణం నుంచి చూస్తే మంచీచెడూ అర్థమవుతుంది. ప్రతిపార్టీకి రాజకీయ ప్రయోజనాలు ఉంటాయి. కానీ ఏ భారీ సంస్కరణనూ ఆ దృష్టితో ప్రతిపాదిస్తునట్లు చెప్పదు. దేశ ప్రయోజనం కోసమే దాన్ని తెస్తున్నట్లుగా ప్రజల ముందుకు తెస్తుంది. జమిలి ఎన్నికలనూ అలాగే ప్రచారంలో పెట్టారు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించటం వల్ల స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) 1.5 శాతం పెరుగుతుందనీ దీంతో ప్రజల జీవనప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయనీ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్వర్యంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికలను ఎక్కువమంది ప్రజలు కోరుకున్నారని కూడా కోవింద్ కమిటీ తెలిపింది. 2024%-%2025 ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ (ద్రవ్యోల్బణాన్ని మినహాయించకుండా చూస్తే) 370 లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఇందులో 1.5 శాతమంటే రూ.5.5 లక్షల కోట్లు. అంటే ఇంత మొత్తం మన జీడీపీకి అదనంగా తోడవుతుందన్నమాట! కోవింద్ కమిటీ తీసుకున్న జీడీపీ అంచనాలు కాస్త పాతవి. వాటి ప్రకారం జమిలి ఎన్నికలతో రూ.4.5 లక్షల కోట్లు అదనంగా జీడీపీకి తోడవుతాయి. అదనంగా పెరిగే 1.5 శాతం జీడీపీ అయిదు సంవత్సరాల కాలంలో మొత్తంగా పెరిగేదా? లేక ఎన్నికలు ఏటా ఎక్కడో ఒకచోట జరుగుతాయి కాబట్టి అది వార్షిక అదనపు వృద్ధిరేటా? అన్నదానిపై స్పష్టత లేదు. మన ఆర్థికాభివృద్ధిని తొలి ఎన్నికల (1952) నాటి నుంచి విశ్లేషించి చేసిన నిర్ధారణగా దాన్ని చెప్పలేం. జమిలికి సమర్థన కోసం వేసిన అంచనాగా మాత్రమే దాన్ని భావించగలం! జమిలి




ప్రక్రియ 2029లో మొదలైతే ఆనాటికి జీడీపీ మరింత పెరుగుతుంది. రూ.700 లక్షల కోట్లకు అది చేరుకునే అవకాశం ఉంది. అంటే జమిలి వల్ల రూ.10 లక్షల కోట్లు అదనపు ప్రయోజనం కలుగుతుంది! అంకెల పరంగా గొప్పగానే ఉంది. ఇక ఆర్థికాభివృద్ధితో పాటు ద్రవ్యోల్బణం తగ్గుదల, పెట్టుబడుల పెంపు, వ్యయంలో గుణ్మాత్మక మార్పు లాంటి ప్రయోజనాలు కూడా జమిలి ఎన్నికల వల్ల కలుగుతాయని కూడా కోవింద్ కమిటీ పేర్కొంది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే అనేక ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది! మన ఆర్థిక వ్యవస్థపై ఎన్నో ప్రామాణిక పరిశోధనలు జరిగాయి. 2014 తర్వాత ప్రభుత్వ గణాంకాల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తినప్పటికీ ఆర్థిక వ్యవస్థకూ రాజకీయాలకూ ఉన్న సంబంధాల గురించి విలువైన విశ్లేషణలు మాత్రం తగ్గలేదు. జమిలి ఎన్నికలు పట్టాలు తప్పటం 1967 తర్వాత మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి నాలుగో సార్వత్రిక ఎన్నికల నాటి (1967) నుంచి ఎదురుదెబ్బలు ఎదురయ్యాయి. 1962 నాటి ఎన్నికలతో పోల్చితే 78 సీట్లు తగ్గిపోయాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 261 సీట్లు కావాల్సివస్తే కాంగ్రెస్ 283 సీట్లనే గెలుచుకుంది. తొమ్మిది రాష్ట్రాల్లో అధికారాన్నీ కోల్పోయింది. ఆ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన పార్టీలు ఎక్కువకాలం అధికారంలో ఉండలేకపోయాయి. ఒకటిరెండు చోట్ల మినహా కాంగ్రెసే ఏదోవిధంగా తిరిగి అధికారాన్ని పొందింది. కొన్నిచోట్ల అసెంబ్లీలు రద్దు అయ్యి మళ్లీ ఎన్నికలూ జరిగాయి. అప్పటి నుంచి ఏకకాలంలో ఎన్నికలు అసాధ్యమయ్యాయి. 1971లో లోక్‌సభకు కూడా మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 1980, 1991, 1998, 1999ల్లోనూ లోక్‌సభకు ముందుగానే ఎన్నికలు జరపాల్సిన పరిస్థితులు వచ్చాయి. రాజకీయ అస్థిరత వల్ల సకాలంలో విధాన నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితులు ఎదురయ్యాయనటంలో సందేహం లేదు. కానీ అవి దేశ జీడీపీని గణనీయంగా ప్రభావితంచేసే స్థాయికి ఎప్పుడూ వెళ్లలేదు. పూర్తిమెజారిటీ ఉన్న ప్రభుత్వాలు సరైన విధానాలు చేపట్టకపోవటంతో ఆర్థిక వ్యవస్థ అనుకున్నంతగా పరుగులు తీయలేదు. యుద్ధాలు, అనావృష్టి కూడా ఆర్థిక మందగమనానికి తోడ్పడ్డాయి. ఎన్నో విప్లవాత్మక విధానాలను తీసుకువచ్చి ఆచరణలో నీరుకార్చారు. సుస్థిర ప్రభుత్వాల హయాంలోనే ఇవన్నీ జరిగాయి. కానీ జమిలి ఎన్నికలు లేకపోవటంతో ఆర్థిక ప్రగతికి అడ్డంకులు ఏర్పడ్డాయని చెప్పేందుకు సాధికారిక సమాచారం లేదు ఇక ఏకకాలంలో ఎన్నికలు జరిగినప్పుడు మన ఆర్థిక ప్రగతి అద్భుతమని చెప్పలేం. 1967 వరకూ మన తలసరి జాతీయ ఆదాయం పెరుగుదల రెండు సందర్భాల్లోనే 5 శాతం దాటింది. మూడు సందర్భాల్లో మైనస్‌లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాతా మైనస్‌లోకి వెళ్లిన ఏడాదులూ ఉన్నాయి. 2003%-%04 నుంచే అది 6 శాతం దాటటం మొదలైంది. జీడీపీలో కాస్త గణనీయ పెరుగుదల 1980ల నుంచి ఆరంభమైంది. అంతకుముందు 30 సంవత్సరాల సగటు అభివృద్ధి రేటు 3.5 శాతానికి కాస్త అటూఇటూగానే ఉండిపోయింది. 1980%-%81 నుంచి 1991%-%92 వరకూ సగటు వృద్ధిరేటు 5.3 శాతం నమోదైతే ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన తర్వాత అంటే 1992%-%93 నుంచి 2003 -%04 వరకూ 5.9 శాతానికి పెరిగింది. తరచూ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందనీ భావించలేం

# అది 'మినీ భారత్'!

దేవతల దేశంగా పిలువబడే నేల కేరళ. అంతేకాదు, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా చెప్పబడే నేల. అనేక మతాలు, జాతులు, ప్రజలతో సహజీవనం చేస్తున్న సహనశీల తలం. వందశాతం సంపూర్ణ అక్షరాస్యత, సామాజిక చైతన్యంతో భాసిల్లుతున్న భూమి. చతాంబి స్వామి, శ్రీ నారాయణగురు, అయ్యన్‌కాళీ లాంటి సంఘ సంస్కర్తలు నడయాడిన నేల. ప్రగతిశీల సామరస్య పాలనలో దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్నది కేరళ. అలాంటి రాష్ట్రంలో ఆదినుంచి విద్వేష కుంపటి రగిలించాలను కుంటున్నది ఆరెస్సెస్-బీజేపీ. శబరిమల వివాదం ఒక ఎత్తయితే 'ది కేరళ స్టోరీ' వరకు అంతా అట్టర్ ప్లాపే. నిరంతరం లౌకికత్వాన్ని చాటే అక్కడి ప్రజలు ఎప్పటికప్పుడు విద్వేషపు కుట్రల్ని తిప్పి కొడుతూనే వున్నారు.అయినప్పటికీ సంఘ్ పరివార్ ఆశ చావడం లేదు. అవకాశం దొరికినప్పుడే కాదు, వీలు కల్పించు కుని మరీ విద్వేషాగ్ని రగిలి స్తున్నది.

మొన్నటికి మొన్న మహారాష్ట్ర మంత్రి నితీష్‌రాణే కేరళను 'మినీ పాకిస్థాన్' అంటూ చేసిన వ్యాఖ్య 'హిందూత్వ' పడగను మరోసారి తట్టిలేపింది. మతం పేరుతో ప్రజల్ని విభజిస్తూ పాలించాలనే వ్యూహాన్ని బహిర్గతపరిచింది. లౌకికవాదం, మత సామరస్యానికి కంచుకోట అయిన కేరళపై సంఘ్ పరివార్ చేసే విద్వేష ప్రచారాన్ని వెల్లడిచేసింది. బీజేపీకి చెందిన ఆ మంత్రి కాంగ్రెస్ అగ్రనేతలను ఉద్దేశించి 'కేరళ మినీ పాకిస్థాన్ అయినందునే వయనాడ్ నుంచి వారిద్దరు ఎంపీలుగా ఎన్నికయ్యారు' అని వ్యాఖ్యానించారు. ఒక మంత్రి ఇంకొక రాష్ట్రంపై చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థమేంటి? లౌకికవాదులైన భారత ప్రజలను ఎటుతిప్పదలుచుకున్నారు కాషాయపు నేతలు.

చట్టసభల్లో ప్రజాప్రతినిధిగా ఎన్నికైనవారు భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడతానని, రాగ ద్వేషాలకతీతంగా పాలన అందిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. కానీ, మంత్రి రాణే వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే కాదు, మత సామరస్యానికి తీవ్ర విఘాతం కూడా. ఇలాంటివారికి మంత్రిగా కొనసాగే నైతిక హక్కు ఉందా? కేరళ రాష్ట్రం పాకిస్థాన్‌లోనే ఉన్నట్టుగా మాట్లాడిన తీరు తీవ్ర



అభ్యంతరకరం. రాణే వ్యాఖ్యలు దేనికి సంకేతమో ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లు సమాధానం చెప్పాలి. ఎక్కడపడితే అక్కడే బీజేపీ-సంఘ్ పరివార్ నేతలు బహిరంగ సభల్లో, సదస్సుల్లో మతోన్మాద విషాన్ని చిమ్ముతుంటే భిన్నత్వంలో ఏకత్వం రోజురోజుకూ ప్రశ్నార్థకమవుతున్నది. ఇది ఒక్క హిందువులనో, ముస్లింలనో కాదు, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. లౌకికవాదానికి, ప్రగతిశీల సమైక్యభావనకు పర్యాయపదంగా నిలిచే కేరళపై విద్వేష వ్యాఖ్యలు సిగ్గుచేటు. కేరళ అంటేనే ప్రగతి. అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతూ దేశాన్ని ఆకర్షిస్తున్నది. ఇది సంఘ్ పరివార్‌కు అస్సలు రుచించడం లేదు. అందుకే వామపక్షాల ఏలుబడిలోని 'ఎల్‌డీఎఫ్'ను ఎదుర్కోలేక విద్వేషాలతో ప్రజల్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నది.పైగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులకూ కొర్రీలు పెడుతున్నది. రాయితీలు తగ్గించి పన్నుల భారం మోపుతున్నది. కేంద్ర భారాలు, హెచ్చుతగ్గులు ఎలా ఉన్నా తమ రాష్ట్రానికి లాభమా, నష్టమా అని బేరీజు వేసుకున్న తర్వాతే అక్కడ అమలుకు సిద్ధపడుతున్నది కేరళ సర్కార్.

'కులం, మతం, జాతీయత ఆధారంగా చేసే విద్వేష ప్రసంగాలు రాజ్యాంగం ఉపదేశించిన సౌభ్రాతృత్వానికి సవాళ్లు విసరడమే కాదు, దేశ ఐక్యతనూ దెబ్బతీస్తాయి' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవంగా చూస్తే కూడా దేశం చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉందని చెప్పడానికి ఇటీవల పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. అంతేకాదు, ఉత్తరప్రదేశ్‌లో ఈనెల పదమూడు నుంచి ప్రారంభం కానున్న మహాకుంభమేళాలో హిందూయేతరులకు దుకాణాలు కేటాయించవద్దని అఖిల భారతీయ అఖాడా పరిషత్ చీఫ్ మహంత్ రవీంద్ర పురీ వ్యాఖ్యా నించారు. 'వాళ్లు ఎక్కడబడితే అక్కడ ఉమ్మలేస్తారు.. మూత్రం పోస్తారు. పవిత్ర మహాకుంభమేళా అపవిత్రం అయిపోతుంది.' అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బీజేపీ-ఆరెస్సెస్ నిలువెల్లా మతోన్మాద విషాన్ని నింపుకుని పాలన సాగిస్తోంది. ఈ విభజన సిద్ధాంతాలు, ఆర్థిక అసమానతలు, ప్రజల్ని ఐక్యంగా ఉంచలేవు. పైగా అట్టడుగువర్గాలకూ సామాజికన్యాయాన్ని అందించలేవు. తిరోగమన విధానాలకు నెలవైన మనుస్మృతిని వల్లెవేస్తూ విద్వేషవ్యాఖ్యలు చేసే వారి విషపు కోరల్ని ప్రజలే పీకి పారేయాలి.

# కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన కొత్త ట్రాఫిక్ రూల్స్ ఇవే





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

రెడ్ లైట్ ఉల్లంఘన
- మునుపటి జరిమానా: రూ.100
- ప్రస్తుత జరిమానా: రూ.500

అథారిటీ ఆదేశాలను ధిక్కరించడం
- మునుపటి జరిమానా: రూ.500
- ప్రస్తుత జరిమానా: రూ.2,000

లైసెన్స్ లేకుండా డ్రైవింగ్
- మునుపటి జరిమానా: రూ.500
- ప్రస్తుత జరిమానా: రూ.5,000

అతివేగం
- మునుపటి జరిమానా: రూ.400
- ప్రస్తుత జరిమానా: రూ.1000

ప్రమాదకరమైన డ్రైవింగ్
- మునుపటి జరిమానా: రూ.1000
- ప్రస్తుత జరిమానా: రూ.5,000

డ్రంక్ అండ్ డ్రైవ్..
- మునుపటి జరిమానా: రూ.2000
- ప్రస్తుత జరిమానా: రూ.10,000

రేసింగ్, స్పీడింగ్
- మునుపటి జరిమానా: రూ.500
- ప్రస్తుత జరిమానా: రూ.5,000

హెల్మెట్ ధరించకపోవడం
- మునుపటి జరిమానా: రూ.100
- ప్రస్తుత జరిమానా: రూ.1000 ం మూడు నెలలకు లైసెన్స్ రద్దు

సీట్‌బెల్ట్ ధరించకపోవడం
- మునుపటి జరిమానా: రూ.100
- ప్రస్తుత జరిమానా: రూ.1000

అత్యవసర వాహనాలను అడ్డుకుంటే..
- మునుపటి జరిమానా: నిర్దిష్ట జరిమానా లేదు
- ప్రస్తుత జరిమానా: రూ.10,000

బైక్‌పై ట్రిపుల్ రైడింగ్
- ప్రస్తుత జరిమానా: రూ.1,200


ద్విచక్ర వాహనాలపై ఓవర్‌లోడ్
- మునుపటి జరిమానా: రూ.100
- ప్రస్తుత జరిమానా: రూ.2,000 ం మూడు నెలలకు లైసెన్స్ రద్దు.

ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్
- మునుపటి జరిమానా: రూ.1,000
- ప్రస్తుత జరిమానా: రూ.2,000

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో పాటు నూతన రహదారి భద్రతా నిబంధనలు కూడా ఈ నెలలో అమలులోకి వచ్చాయి.ఈ చట్టాల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.గతంలోనే మైనర్లు వాహనాలు నడిపి యాక్సిడెంట్లు చేస్తే పెద్దవారికి శిక్షలు పడేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టాల ప్రకారం... ఇప్పుడు మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే..ఏకంగా రూ.25 వేల రూపాయలు జరిమానా విధిస్తారు.దాంతో పాటు 25 ఏళ్ల వయసు వచ్చే వరకు లైసెన్స్ పొందే అవకాశం లేకుండా ఆంక్షలు విధించనున్నారు.
మరి తస్మాత్ జాగ్రత్త?

# పంచాయతీతో పాటే మున్సిపల్ ఎన్నికలు..!!

-ఈ నెల 26న ముగియనున్న మున్సిపాలిటీల టర్మ్
-కొత్తగా 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్ల ఏర్పాటు
-డివిజన్లు, ఓటర్ల లిస్టుపై అధికారుల కసరత్తు
-శివారు పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం




హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలతో పాటు.. లేదంటే కొద్దిరోజుల గ్యాప్తో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 26తో మున్సిపాలిటీల టర్మ్ ముగియనుంది. సంక్రాంతి పండుగ తర్వాత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ చేసి ఈ నెల చివరివారం నుంచి ఫిబ్రవరి మొదటివారంలోగా మూడుదశల్లో ఎలక్షన్స్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. కులగణన వివరాలు ఇప్పటికే బీసీ డెడికేషన్ కమిషన్కు చేరడంతో త్వరలోనే సర్కారుకు రిపోర్టు ఇవ్వనుంది. దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లపై సర్కారు ప్రకటన చేయగానే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. పంచాయతీల పదవీకాలం గతేడాది ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం పెండింగ్లో ఉండడం వల్లే ఎన్నికలు ఆలస్యమవుతూ వచ్చాయి. మున్సిపల్ ఎన్నిలకు ఆ సమస్య లేకపోవడంతో పంచాయతీ ఎన్నికలతోపాటే నిర్వహించాలని సర్కారు భావిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

**-నేడో.. రేపో.. గెజిట్**

రాష్ట్రంలో ఇప్పటికే 141 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. ఇటీవల కొత్తగా 12 మున్సిపాలిటీలను, మహబూబ్ నగర్, మంచిర్యాల కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిపై నేడో, రేపో గెజిట్ విడుదల కానుంది.
ఇందులో 129 మున్సిపాలిటీల టర్మ్ ఈ నెల 26తో ముగియనుంది. మరో 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల టర్మ్ ఈ ఏడాది మే వరకు ఉంది. జీహెచ్ఎంసీ టర్మ్ వచ్చే ఫిబ్రవరి వరకు ఉన్నప్పటికీ ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించే చాన్స్ ఉంది. గతంలో 138 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగ్గా 5 మున్సిపాలిటీల (పాల్వంచ, జహీరాబాద్, మణుగూరు, ఆసిఫాబాద్, మందమర్రి)కు ఎన్నికలు జరగలేదు.

**-మార్పులు చేర్పులు షురూ**

ప్రభుత్వం ఇటీవల 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు ఏర్పాటుతో పాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధి పెంచింది. ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటన చేసింది. 12 మున్సిపాలిటీల్లో కోహీర్, గుమ్మడిదల, గడ్డ పోతారం, ఇస్నాపూర్ (సంగారెడ్డి జిల్లా).. చేవేళ్ల, మోయినాబాద్ (రంగారెడ్డి జిల్లా).. మద్దూర్ (కొడంగల్ నియోజకవర్గం) దేవరకద్ర (మహబూబ్నగర్జిల్లా).. కేసముద్రం, స్టేషన్ ఘన్ పూర్ (వరంగల్ జిల్లా) అశ్వారావుపేట (కొత్తగూడెం జిల్లా).. ఏదులాపురం (ఖమ్మం జిల్లా) ఉన్నాయి. వీటిలో జనాభా, ఓటర్ల ప్రకారం డివిజన్ల ఏర్పాటుపై అధికారులు కసరత్తు షురూ చేశారు. నెలరోజుల్లో ఈ ప్రాసెస్ పూర్తి కానున్నట్లు సమాచారం. మరో వైపు హైదరాబాద్ శివారులో ఉన్న 58 గ్రామ పంచాయతీలను సైతం శివారు మున్సిపాలిటీల్లో సర్కారు విలీనం చేసింది. ఇక్కడ కూడా వార్డుల విభజన సాగుతున్నది. ఇవన్నీ నెలరోజుల్లో కొలిక్కి రానుండగా, పంచాయతీల వెంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి సమస్య ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**-కొలిక్కి రానున్న రిజర్వేషన్లు**

లోకల్ బాడీల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం ఇటీవల కులగణన చేపట్టింది. ఇందుకు సంబంధించిన డేటా ఎంట్రీ కూడా దాదాపు పూర్తయ్యింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయగా వారంలోగా ప్రభుత్వానికి రిపోర్ట్ అందించనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లపై సర్కారు ప్రకటన చేయగానే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. ఆ లెక్కనే పెరిగిన బీసీ రిజర్వేషన్ల ఆధారంగా మున్సిపాలిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వవచ్చని అధికారయంత్రాంగం భావిస్తున్నది.


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ గారిని కలసిన బొడ్డు బిక్షపతి గౌడ్.



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
ఈరోజు తెలంగాణ హైకోర్టులో టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ గారిని వారి ఛాంబర్ లో కలిసి వారికి తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదం మరియు కాలసూచి ని అందజేసి వారికి 2025 నూతన సంవంత్సరం శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ సందర్బంగా వారు టీపీసీసీ లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ బొడ్డు బిక్షపతి గౌడ్ గారిని ఈ సంవత్సరం అంత మంచి జరగాలని మరిన్ని అత్యున్నత పదవులు పొంది, అందరితో గౌరవించబడాలని ఆశీర్వధించినారు.

## మొమిన్ రోషన్ జమీర్, షబ్బీర్ అహ్మద్ సాహెబ్ కుమార్తె నికాహ్ వేడుకకు హాజరయ్యారు.



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
మొమిన్ రోషన్ జమీర్, అడ్వకేట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు సోషల్ మీడియా, లీగల్ సెల్ (చట్టం, మానవ హక్కులు మరియు ఆర్టీఐ విభాగం) ఇన్‌ఛార్జ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, షబ్బీర్ అహ్మద్ సాహెబ్ కుమార్తె నికాహ్ వేడుకకు 03-01-2024 న హైదరాబాదులో హాజరయ్యారు. వధువు, వరుడు, మరియు వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ముసాబ్ రహీమ్ హాష్మీ, జునైద్ ఖాన్, నయీమ్, అడ్వకేట్లు సజీద్ భాయ్, షాహిద్ భాయ్, ఓమర్, ఇర్ఫాన్, నితిన్ మరియు ఇతరులు పాల్గొన్నారు.ఏ

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



గద్వాల జిల్లా బ్యూరో, జనవరి03 ప్రజా స్వేచ్ఛ
ప్రముఖ సంఘ సేవకురాలు, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం మల్దకల్ మండలం విద్యాశాఖ అధికారి సురేష్ ఆధ్వర్యంలో మల్దకల్ జెడ్పీహెచ్ఎస్ లో సావిత్రి బాయి పులే చిత్రపటానికి పులమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎంఈఓ ఆధ్వర్యంలో సీనియర్ మహిళా ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులైన కేవి జ్యోతి, ఎన్.సుజాత, బి.శుభలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ.. స్త్రీల విద్య కోసం అహర్నిశలు శ్రమించిన గొప్ప సంఘ సేవకురాలు సావిత్రిబాయి పూలే అని, కేవలం విద్యా ద్వారా మాత్రమే సమాజంలోని అసమానతలను తగ్గించవచ్చని నమ్మి స్త్రీల కోసం అనేక పాఠశాలలు స్థాపించిన సంఘసంస్కర్త అని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు నివాళి



పరిగి, జనవరి 03 ప్రజా స్వేచ్ఛ
దేశంలో మనువాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి పార్టీ పరిగి డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ పరిధిలో సావిత్రిబాయి పూలే 194 వ జయంతి సందర్భంగా పరిగి సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు, కార్మికులకు, కర్షకులకు అణగారిన వర్గాలకు భారతదేశంలోని మొట్టమొదటి మహిళా పాఠశాలను ఏర్పాటు చేసి విద్య నేర్పిన మొదటి గురువు అని వివరించారు. కుల నిర్మూలన కోసం సత్యశోధన చేస్తూ అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తూ కుల సమానతల పైన, వివక్షత పైన ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యం చేయడం జరిగిందని వర్ణించారు. అదేవిధంగా సావిత్రిబాయి పూలే జ్యోతిరావు పూలేతో కలిసి విద్యా హక్కు కోసం, సమానత్వం కోసం చాలా పోరాటం చేశారని, మహిళా సాధికారత వంటి రంగాల్లో జ్యోతిరావు పూలే దంపతులు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. వారు నేటి సమాజానికి ఆదర్శప్రాయులని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నేటి సమాజానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జే.శివకుమార్, కే నర్సిములు, ఎం.వెంకటేష్, బీ.శ్రీనివాస్, ఆర్. లక్ష్మన్,కే. కృష్ణయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# మొదటి పరీక్ష పంచాయతీ ఎన్నికలే..!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

కొత్త సంవత్సరంలో మొదటి ఎన్నికలు, రాజకీయ పార్టీలకు మొదటి పరీక్ష పంచాయతీ ఎన్నికలే కానున్నాయి. ఇప్పటికే అధికారులు అన్ని పనులు దాదాపు పూర్తి చేశారు. సర్పంచులకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులు కూడా ఎంపిక చేశారు. ఇక వాటి ముద్రణకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. మరో వైపు ఆయా పార్టీలు సైతం పంచాయతీ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించాయి.

నూతన సంవత్సర వేడుకల నుంచే.. ఇటీవల హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఒక గ్రామపంచాయతీ నాయకుడు తానే సర్పంచి అభ్యర్థినని ప్రకటించుకున్నాడు. తనకే పెద్ద నాయకుల ఆశీస్సులు ఉన్నాయని సదరు నాయకుడు సోషల్ మీడియా వేదికగా ప్రకటించుకోవడం ఆ మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి పరిస్థితి చాలా గ్రామపంచాయతీలలో ఉంది. కొన్నింట్లో నూతన సంవత్సర వేడుకలకు భారీగా ఖర్చు చేసి ఓటర్లను ఆకట్టుకునేందుకు విందులు కూడా ఏర్పాటు చేశారు. కొన్ని పంచాయతీలలో అధికార పార్టీ నాయకులలోనే ఇద్దరు, ముగ్గురు పోటీ పడుతున్నారు. పెద్ద నాయకులు వీరిలో ఎవరినీ నిలువరించే పరిస్థితి కూడా లేదు. ఆయా పంచాయతీలలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ కోసం కష్టపడిన వారికే అవకాశాలు ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ చాలా పంచాయతీల్లో అలా కాకుండా.. పార్టీలు మారి వచ్చిన వారే ముందు వరుసలో నిలిచిన పరిస్థితి కూడా ఉంది.

**-ఎవరు గెలిచినా మనోడే**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయింది. మరో నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉంటారు. ఆయా గ్రామాల పరిస్థితిని బట్టి పోటీ అధికంగా ఉన్న చోట నిర్ణయం వారికే వదిలేసి ఎవరు గెలిచినా వారు తమ పార్టీ అని చెప్పుకొనే పరిస్థితి ఉంది. ఇతర పార్టీల నుంచి గెలిచినా అధికార పార్టీలోకి మారడం ఇటీవలి కాలంలో మామూలైంది. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన పురపాలక ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు అనేక మంది భారాస పార్టీలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. వారిలో కొందరు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. పోటీ గట్టిగా ఉండి, చర్చల వల్ల ఎవ్వరూ తగ్గని గ్రామాల్లో.. వారిని పోటీ పడనిచ్చి గెలిచిన అభ్యర్థిని పార్టీ అభ్యర్థి అని ప్రకటించాలన్న ప్రతిపాదన కూడా కొన్ని గ్రామాల నుంచి నాయకులే నియోజకవర్గస్థాయి నాయకులకు చెబుతున్న పరిస్థితులు ఉన్నాయి.

# ఓపెన్ టెన్త్, ఇంటర్ ఎగ్జామ్ ఫీజు షెడ్యూల్ రిలీజ్..!!

**-9 నుంచి 22 వరకు ఫీజు చెల్లింపునకు చాన్స్**






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ఆధ్వర్యంలో ఏప్రిల్, మే నెలల్లో జరిగే ఎస్ఎస్ సీ, ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామ్ ఫీజు షెడ్యూల్ గురువారం రిలీజ్ అయింది. ఈ నెల 9 నుంచి 22 వరకూ ఎలాంటి ఫైన్ లేకుండా ఫీజు చెల్లించవచ్చని టాస్ డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. రూ.25 జరిమానాతో ఈ నెల 23 నుంచి 29 వరకు రూ.50 లేట్ ఫీజుతో 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు, తత్కాల్ విధానంలో ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించినట్టు ఆయన చెప్పారు. ఆన్ లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. http://www.telanganaopen-school.org వెబ్ సైట్ ద్వారా లేదా టీజీ ఆన్ లైన్/మీ సేవా సెంటర్లలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# నెంటూర్ గ్రామంలో హరిహర లిఖిత మహాయజ్ఞం

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

హరిహర లిఖిత మహా యజ్ఞం గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం నాడు వర్గల్ మండల్ నెంటూర్ గ్రామంలోని హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో జరుగునని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు తెలిపారు.

భక్తులందరు ఈ లిఖిత మహాయజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# మల్లన్న సాగర్ నుంచే గోదావరి రెండో దశ..!!





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

మహా నగర తాగునీటి అవసరాల కోసం గోదావరి రెండో దశ ప్రాజెక్టును మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచే ప్రభుత్వం చేపట్టనుంది.

సుమారు రూ.7,300 కోట్ల అంచనా వ్యయంతో రెండు పైపులైన్ల ద్వారా 20 టీఎంసీల నీటి తరలింపుపై శుక్రవారం సీఎం అధ్యక్షతన జరిగే జలమండలి పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. గతేడాది ఆగస్టులోనే గోదావరి రెండో దశను మల్లన్న సాగర్ నుంచి చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ.. కొండపోచమ్మ కాదని మల్లన్నసాగర్ నుంచి జలాల తరలింపుపై ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రెండింటి నుంచి జలాల తరలింపు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యాప్కోస్ సంస్థ కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నీటి లభ్యత, తరలింపు వ్యయం తదితర అంశాలపై సమగ్ర సర్వే చేసి తాజాగా నివేదిక సమర్పించింది. అందులో గోదావరి రెండో దశను మల్లన్న సాగర్ నుంచే చేపట్టడమే సబబు అని సిఫార్సు చేసింది.

**-ఇదీ పరిస్థితి...**

గోదావరి జలాల్లో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు 30 టీఎంసీల నీటి కేటాయింపులుండగా, ప్రస్తుతం గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. మరో 20 టీఎంసీలు తరలించేందుకు వెసులుబాటు ఉంది. మహా నగరానికి రోజురోజుకూ తాగునీటి అవసరాలు పెరుగుతుండడంతో పాటు నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, సింగూర్, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల నుంచి సుమారు 555 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నా.. సరిపడని పరిస్థితి నెలకొంది. దీంతో గోదావరి రెండో దశను చేపట్టేందుకు జలమండలి సిద్ధమైంది.

-తెరపైకి మల్లన్న సాగర్..

తాజాగా కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ తెరపైకి వచ్చింది. అయిదేళ్ల క్రితం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో రెండో అతిపెద్ద జలాశయమైన కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్ మహా నగరానికి నీటి తరలింపు కోసం ప్రణాళిక సిద్ధమైనా.. భూ సేకరణ వివాదాలతో ముందుకు సాగలేదు. మరోవైపు కొండ పోచమ్మ రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం కూడా 15 టీఎంసీల మాత్రమే ఉండటంతో, 50 టీఎంసీల సామర్థ్యమున్న మల్లన్న సాగర్‌పై జలమండలి దృష్టి సారించింది. నగరానికి సమీంపలోని మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను శామీర్‌పేట ఘన్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు తరలించే విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేసి జలమండలి ప్రభుత్వానికి సమర్పించింది. గతేడాదిలో రాష్ట్ర మంత్రి వర్గం కూడా మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాల తా గునీటి సరఫరా పథకం-2కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

**పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం**

గోదావరి రెండో దశ ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగినట్లయింది. తొలుత దాదాపు 15 టీఎంసీల నీటి తరలింపు కోసం సుమారు రూ.5,560 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు సమగ్ర నివేదిక రూపకల్పన జరగ్గా.. తాజాగా సుమారు 7,300 కోట్ల అంచనా వ్యయంతో రెండు పైపులైన్ల ద్వారా 20 టీఎంసీల ద్వారా తరలించేలా వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్ సిద్ధం చేసి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. పాలక మండలిలో గ్రీన్ సిగ్నల్ లభిస్తే రెండేళ్లలో పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

మల్లన్న సాగర్ (ఫైల్)

-రెండు పైపులైన్ల ద్వారా 20 టీఎంసీల నీటి తరలింపు

-పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం

-ప్రభుత్వానికి సిఫార్సు చేసిన వ్యాప్కోస్ సంస్థ

-నేడు జలమండలి పాలక మండలి సమావేశంబి

పుష్కర కాలం తర్వాత జలమండలి పాలక మండలి సమావేశం శుక్రవారం జరగనుంది. సమావేశంలో గోదావరి నీటి సరఫరా పథకం రెండో దశపై నిర్ణయం, సుమారు రూ.301 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న జోన్-2 సమగ్ర మురుగునీటి మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టు, 39 అమృత్ ఎస్టీపీలు, జంట జలాశయాలపై నాలుగు ఎస్టీపీల నిర్మాణాలు తదితర అంశాలు చర్చించి ఆమోదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాలకమండలి చైర్మన్, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎక్స్- అఫీషియో డైరెక్టర్లు మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్, ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, డైరెక్టర్లు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ (టెక్నికల్),

# బిజినెస్

## ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు మళ్లీ తగ్గాయ్..!



భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 4.112 బిలియన్ డాలర్లు తగ్గాయని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుక్రవారం తెలిపింది. 2024 డిసెంబర్ 27వ తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 4.112 బిలియన్ డాలర్లు నష్టపోయి 640.279 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్బీఐ వెల్లడించింది. అంతకు ముందు డిసెంబర్ 20తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 8.478 బిలియన్ డాలర్లు పతనమై 644.391 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత కొన్ని వారాలుగా భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పతనం అవుతున్నాయి. యూఎస్ డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కాకుండా ఆర్బీఐ బహిరంగ మార్కెట్లో జోక్యం చేసుకుని డాలర్లు విక్రయిస్తున్నది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లతో జీవిత కాల గరిష్టానికి చేరుకున్నాయి.ఈ నెల 27తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏస్) 4.641 బిలియన్ డాలర్లకు పతనమై 551.921 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. బంగారం రిజర్వ్ నిల్వలు 541 మిలియన్ డాలర్లు తగ్గిపోయి 66.268 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్ఎస్) 12 మిలియన్ డాలర్లు తగ్గి, 17.873 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిల్వలు 4.217 బిలియన్ డాలర్లు యధాతథంగా కొనసాగాయి.

## తీరు మారేదే..లే ఆగని రూపాయి పతనం



భారతీయ కరెన్సీ రూపాయి.. డాలర్ ముందు తేలిపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపీ మారకపు విలువ రోజుకింత దిగజారుతూ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పతనమవుతున్నది. గురువారం మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోల్చితే ఎక్స్ఛేంజ్ రేటు 85.75 వద్దకు క్షీణించింది. దీంతో ఈ ఏడాది రూపాయికి తొలి నష్టం ఎదురైనైట్టైంది. ఇంట్రా-డేలోనైతే 85.79కి పడింది. ఇక బుధవారం స్థిరంగా ఎక్కడిదక్కడే ఉన్న విషయం తెలిసిందే.కాగా, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్, దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ట్రేడర్లు చెప్తున్నారు. కాగా, ఈ 2025లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు తక్కువేనన్న సంకేతాలు, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతుండటంతో పరుగులు పెడుతున్న డాలర్ ఇండెక్స్, అమెరికా పదేండ్ల బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం వంటివి భారతీయ కరెన్సీని మరింత ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రూపాయి పత నం దేశ ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందే. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, జీడీపీ పతనం వంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది.

## వడ్డీరేట్ల కోతకు వేళాయె..!



ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను తగ్గించే వీలుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. దీంతో రాబోయే మూడు ద్రవ్యసమీక్షలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. జూన్‌కల్లా రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) తగ్గవచ్చని అమెరికాకు చెందిన బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్ చెప్తున్నది. దీంతో ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలల్లో ఆర్బీఐ జరిపే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలపైనే ఇప్పుడు అందరి దృష్టీ నెలకొంటున్నది.రెండేండ్ల తర్వాత.. దాదాపు రెండేండ్లుగా రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను ఆర్బీఐ యథతథంగానే ఉంచుతున్నది. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా వడ్డీరేట్లను సెంట్రల్ బ్యాంక్ సవరించింది. రెపోరేటును గరిష్ఠంగా 6.5 శాతానికి తీసుకెళ్లింది. ఇక అప్పట్నుంచి అది అక్కడే ఉంటున్నది. కరోనా సమయంలో దిగాలుపడిన దేశ జీడీపీని ఉత్సాహపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించిన ఆర్బీఐ.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపునకు అంతే స్థాయిలో పెంచుకుంటూపోయింది. ఇప్పటికీ ద్రవ్యోల్బణం గణాంకాలు ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిని మించే నమోదవుతుండటంతో వరుస ద్రవ్యసమీక్షలను వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ముగిస్తూ వచ్చేశారు. అయితే ఇప్పుడు వడ్డీరేట్ల కోతకు వేళైందన్న అభిప్రాయాలు అంతటా వినిపిస్తున్నాయి. పైగా ఆర్బీఐకి కొత్త గవర్నర్‌గా శక్తికాంత దాస్ స్థానంలో సంజయ్ మల్హోత్రా రావడం, ఫిబ్రవరి ద్రవ్యసమీక్ష ఆయన ఆధ్వర్యంలోనే జరుగుతుండటం కూడా ఈసారి మీటింగ్‌పై సహజంగానే అంచనాలు పెరిగాయి.

## బుమ్రాతో కోన్ స్టాస్ వాగ్వివాదం



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ జరుగుతున్న చివరి టెస్ట్ లో భారత్ 185 పరుగులకే అలౌట్ అయింది. భారత ఆటగాళ్లో రిషబ్ పంత్ 40 పరుగులు చేయగా.. రవీంద్ర జడేజా 26, గిల్ 20 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో బోలాండ్ 4 వికెట్లు తీయగా.. స్టార్క్ 3, కమ్మిన్స్ 2, లయన్ ఒక వికెట్ పడగొట్టాడు. మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఈ క్రమంలోనే ఆసీస్ ఓపెనర్ సామ్ కోన్ స్టాస్ భారత కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రాతో వాగ్వాదానికి దిగాడు. కోన్ స్టాస్ భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా వాగుతూనే ఉన్నాడు. ఇరిటేషన్ తెప్పించే ప్రయత్నం చేశాడు. ఆసీస్ బ్యాటింగ్ మొదలు పెట్టినప్పుడు అతను దూకుడుగా ఆడాడు. జస్ప్రీత్ బుమ్రా వేసిన మొదటి బంతినే కోన్ స్టాస్ బౌండరీ తరలించాడు. ఈ క్రమంలోనే బుమ్రా మూడో ఓవర్ బౌలింగ్ వేశాడు. నాలుగు బాల్స్ పూర్తి అయ్యాయి. ఐదో బంతి వేసేందుకు సిద్ధం కాగా. . స్ట్రైకింగ్ చేస్తున్న ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. వెనక్కు వెళ్లి బౌలింగ్ చేసే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాన్ ఏదో అన్నాడు. దీంతో బుమ్రా వెనక్కు దిరిగి అతని వద్దకు వెళ్లే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాస్ కూడా మాట్లాడడంతో మాటమాట పెరిగింది. ఈ క్రమంలోనే ఎంపైర్ జోక్యం చేసుకున్నాడు. దీంతో గొడవ సర్దుకుంది. ఆ తర్వాత ఓవర్ చివరి బంతికి బుమ్రా ఖవాజాను ఔట్ చేశాడు. అతను స్లిప్ లో క్యాచ్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్ క్యాచ్ పట్టాడు. దీంతో భారత ఆటగాళ్లు, స్పెషల్లీ బుమ్రా కోన్ స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు. కాగా సమయాన్ని వృథా చేయాలనే వ్యూహంలో భాగంగానే జస్ప్రీత్ బుమ్రాతో ఆస్ట్రేలియా ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ గొడవకు దిగాడని టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ అన్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఆఖరి టెస్ట్ తొలి రోజు ఆట చివర్లో బుమ్రా-కొనస్టాస్ గొడవపడ్డారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఐదో బంతి వేసేందుకు బుమ్రా సిద్ధమవ్వగా.. స్ట్రైకింగ్‌లో ఉన్న ఉస్మాన్ ఖవాజా పక్కకు జరిగాడు. దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. కాస్త ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందుకు నాన్ స్ట్రైకర్‌గా ఉన్న కొన్‌స్టాస్ బదులివ్వడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దూసుకెళ్లేందుకు సిద్ధమవ్వగా అంపైర్లు జోక్యం చేసుకొని వారించారు. ఈ ఓవర్ చివరి బంతికే ఉస్మాన్ ఖవాజా ఔటవ్వగా.. భారత ఆటగాళ్లు కొన్‌స్టాస్ లక్ష్యంగా సంబరాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న రిషభ్ పంత్‌కు బుమ్రా-కొన్‌స్టాస్ గొడవకు సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. సమయాన్ని వృథా చేయాలనే ఉద్దేశంతోనే ఆసీస్ ఓపెనర్లు అలా వ్యవహరించారని పంత్ బదులిచ్చాడు. 'నాకు తెలిసి సమయాన్ని వృథా చేయాలని ఆసీస్ ఓపెనర్లు భావించారు. జస్ప్రీత్ బుమ్రాతో సామ్ కొన్‌స్టాస్ గొడవపడటానికి కారణం కూడా ఇదేనని నేను భావిస్తున్నా. అతను ఏదో అన్నాడు. ఏం అన్నాడో నాకు వినిపించలేదు. కానీ ఆ సమయంలో నాకు అనిపించింది ఏందంటే.. మేం మరో ఓవర్ వేయకుండా సమయాన్ని వృథా చేయాలని భావించారని అర్థమైంది.'అని రిషభ్ పంత్ పేర్కొన్నాడు.

## సుందర్ వికెట్‌పై వివాదం..



థర్డ్ అంపైర్ నిర్ణయంపై ఫైర్ అవుతున్న మాజీలు

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్-ఆస్ట్రేలియా మధ్య సిడ్నీలో ఐదో టెస్టు మ్యాచ్ జరుగుతోంది. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ సిరీస్‌లో చివరి టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బౌలర్లు అద్భుతంగా రాణించి తొలిరోజే టీమిండియాను వెన్నుపోటు పొడిచారు. అయితే, ఈ సమయంలో భారత జట్టు ఆల్‌రౌండర్ ఆటగాడు వాషింగ్టన్ సుందర్ వికెట్‌పై వివాదం నెలకొంది. భారత క్రికెట్ జట్టు కీలక బ్యాట్స్ మెన్ మరోసారి విఫలమై పెద్దగా రాణించలేకపోయారు. దీని తర్వాత, ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ కొంతకాలం పిచ్‌పై నిలవడంలో విజయం సాధించాడు. అయితే, 66వ ఓవర్ చివరి బంతికి పాట్ కమిన్స్‌కు వికెట్ ఇచ్చాడు. సుందర్ కమిన్స్ బౌన్స్ బాల్‌పై పుల్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి బ్యాట్‌కు దగ్గరగా వెళ్లింది. దీనిపై ఆస్ట్రేలియా ఆటగాళ్లు అప్పీల్ చేయగా, మైదానంలోని అంపైర్ తిరస్కరించడంతో కంగారూ జట్టు కెప్టెన్ రివ్యూ తీసుకుని, స్నికోమీటర్‌ను పరిశీలించిన తర్వాత థర్డ్ అంపైర్ అతడిని ఔట్‌గా ప్రకటించాడు. ఈ వికెట్ తర్వాత సుందర్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. దీంతో మరోసారి వివాదాస్పద నిర్ణయంతో భారత బ్యాట్స్‌మెన్ వికెట్ కోల్పోవాల్సి వచ్చింది. వాషింగ్టన్ సుందర్ తొలగింపుపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో తన ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఇక్కడ అభిమానులు కూడా ఆస్ట్రేలియా జట్టును మోసగాళ్లు అంటూ ఆరోపిస్తున్నారు.

# స్పోర్ట్స్

## రోహిత్ తన చివరి టెస్టు మ్యాచ్ ఆడేశాడు..!

### భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్



చివరి టెస్ట్ లో రోహిత్ శర్మ ఆడకపోవడంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ తన చివరి టెస్టు మ్యాచ్ ఆడినట్లు గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. 5వ టెస్ట్ మ్యాచ్ లంచ్ విరామ సమయంలో మాట్లాడిన గవాస్కర్, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25 చివరి టెస్ట్ మ్యాచ్ నుంచి తనకు తానుగా విశ్రాంతి తీసుకోవాలనే రోహిత్ శర్మ నిర్ణయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నాడు. భారత్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించలేదని తను అనుకుంటున్నట్లుగా చెప్పాడు. బహుశా తాము టెస్టు క్రికెట్‌లో చివరిసారిగా రోహిత్ శర్మను చూశామని సునీల్ గవాస్కర్ స్టార్ స్పోర్ట్స్‌తో పేర్కొన్నాడు. సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో రోహిత్ శర్మకు విశ్రాంతి ఇవ్వడం వెనుక సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ పాత్ర ఉందని గవాస్కర్ వాదించారు. సిడ్నీ టెస్టుకు ముందు భారత్ 1-2తో వెనుకబడి ఉంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో నిలవాలంటే సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించాలన్నారు. భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కూడా గవాస్కర్ లాగానే అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటిస్తే ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నాడు. రోహిత్ శర్మ ఈ సిరీస్ లో మూడు మ్యాచ్ లు ఆడాడు. సిరీస్ లో కేవలం 31??పరుగులే చేశాడు. ఒకసారి మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. రోహిత్ 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 10.93 సగటుతో 164 పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలో అతడిపై వేటు వేయాలని డిమాండ్ పెరిగింది. అయితే అతను కెప్టెన్ కాబట్టి అంత త్వరగా వేటు వేయ్యరని అనుకున్నారు. అయితే సిడ్నీ మ్యాచ్ ఒక రోజు ముందు టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మీడియా సమావేశానికి హాజరయ్యారు. సిడ్నీ టెస్ట్ లో రోహిత్ ఆడతాడా అన్న ప్రశ్నకు పిచ్ పరిశీలించన తర్వాత తుది జట్టును ప్రకటిస్తామని గంభీర్ చెప్పాడు. దీంతో చివరి మ్యాచ్ లో రోహిత్ శర్మ ఆడకపోవచ్చని అందురు అన్నుకున్నారు.



# నెట్టింట అందాలతో గత్తరలేపుతోందిగా..

బాలీవుడ్ ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న హీరోయిన్లలో ఆమె ఒకరు. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చేసే గ్లామర్ రచ్చ గురించి చెప్పక్కర్లేదు. నిత్యం మోడ్రన్, గ్లామర్ హాట్ ఫోటోలతో నెట్టింట అగ్గిరాజేస్తుంది. ఇటీవలే తెలుగులోనూ ఓ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. హీరోయిన్ దిశా పటానీ. గతేడాది యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సరసన కల్కి 2898 ఏడీ చిత్రంలో నటించి హిట్టుకొట్టింది. అయితే కల్కి సినిమా దిశాకు మొదటి తెలుగు మూవీ కాదు2015లో మెగా హీరో వరుణ్ తేజ్ సరసన లోఫర్ మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. ఆ తర్వాత హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంది.దివంగత హీరో సుశాంత్ సింగ్ రాజ్ పుత్ నటించిన ఎంఎస్ ధోని సినిమాతో ఈ బ్యూటీ క్రేజ్ మారిపోయింది. అందులో దిశా యాక్టింగ్ చూసి అడియన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.ఆ తర్వాత హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరించింది. అటు సినిమాలు.. ఇటు యాడ్స్ అంటూ ఫుల్ బిజీ అయిపోయింది. అలాగే సోషల్ మీడియాలో నిత్యం గ్లామర్ ఫోటోలతో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంది.



# ధిమాకునోడు చేయాలే..

## ఆసక్తికరంగా సత్యరాజ్ త్రిబాణధారి బార్బరిక్ టీజర్

బాహుబలి ఫేం సత్యరాజ్ లీడ్ రోల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం త్రిబాణధారి బార్బరిక్ మైథలాజికల్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షేర్ చేసిన టైటిల్ గ్లింప్స్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు సత్యరాజ్ పోషిస్తున్న డ్యాక్టర్ శ్యామ్ కథు పాత్ర లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్ లాంచ్ చేశారు మేకర్స్.స్వీయ నాశనానికి మూడు ద్వారాలున్నాయంటూ మొదలైంది టీజర్. గిది నువ్వో నేనో చేసే పని కాదు.. ధిమాకునోడు చేయాలే. ఒకడు తాచుపాము తోకను తొక్కాడు. ఆ పాము తొక్కినవాడిని కాటేయబోతుంది. మరి తొక్కించిన వాడి సంగతేంటి..? అంటూ సాగుతున్న సంభాషణలు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సత్యరాజ్ బార్బరిక్ పాత్రలో జీవించేశాడని టీజర్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ మూవీలో వశిష్ఠ ఎన్ సింహా, సంచి రాయ్, సత్యం రాజేశ్, క్రాంతి కిరణ్, వీటీవీ గణేశ్, మొట్ట రాజేంద్ర, ఉదయ భాను ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని టాలీవుడ్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్‌పై విజయ్‌పాల్ రెడ్డి అడిధాలా నిర్మిస్తున్నారు. పోషిస్తున్నారు ఈ సినిమా భీముడు మనవడు, ఘటోత్కచుడు కుమారుడు బార్బరిక్ కథ ఆధారంగా వస్తోంది. ఎవరు తాతా ఇతను..? అని చిన్నారి అడుగగా.. ప్రపంచం గుర్తించని గొప్ప యోధుడమ్మా.. భీష్ముడా తాతా..? హహ కాదమ్మా.. అంటూ సాగే డైలాగ్స్‌తోపాటు మాధవా.. వెయ్యేనుగుల బలశాలి భీముడికి మనవడిని. ఘటోత్కచుడుకు కుమారుడిని అంటూ బార్బరిక్ పాత్ర ఇంట్రడక్షన్ వీడియో సినిమాపై అంచనాలు పెంచుతోంది.




# ‘పుష్ప 2’ నుంచి ‘గంగో రేణుక తల్లి’ వీడియో సాంగ్ రిలీజ్.!

అల్లు అర్జున్ మాస్ తాండవం చూశారా.. ‘పుష్ప 2’ నుంచి ‘గంగో రేణుక తల్లి’ వీడియో సాంగ్ రిలీజ్.! ఇదిలావుంటే.. ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను చిత్రబృందం ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ‘పుష్ప రాజ్’ సాంగ్‌తో పాటు ‘కిస్సిక్’ దమ్ముంటే పట్టుకోరా షెకావత్ , సూసేకి.. అగ్గిరవ్వ మాదిరే ఉంటాడే నా సామి , సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా ‘గంగో రేణుక తల్లి’ జాతర వీడియో సాంగ్‌ను విడుదల చేసింది. ఈ జాతర ఎపిసోడ్‌లో అల్లు అర్జున్ మాస్ తాండవం చేశాడు. దాదాపు 30 నిమిషాలకు పైగా ఉన్న ఈ సీన్ బన్నీ కెరీర్‌కు హైలెట్‌గా నిలిచింది. ఆస్కార్ అవార్డు విజేత చంద్రబోస్ ఈ పాటకు లిరిక్స్ అందించగా.. మహాలింగం పాడాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు. థియేటర్‌లో ఉర్రుతలు ఊగించిన ఈ సాంగ్‌ను మీరు కూడా చూసేయండి. గ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం ‘పుష్ప 2 ది రూల్’ . సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ.1760 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరికొన్ని రోజుల్లో అత్యధిక కలెక్షన్స్ సాధించిన బాహుబలి(రూ.1804 కోట్ల) సినిమా రికార్డును కూడా ఈ చిత్రం అధిగమించనుంది.





# కిరణ్ అబ్బవరం ‘దిల్ రుబా’ టీజర్ రిలీజ్

క’ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘దిల్ రుబా’ . ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు.ఇటీవల షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి టీజర్ ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. కిరణ్ అబ్బవరం న్యూ ఏజ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తుంది. నాని కృష్ణార్జున యుద్ధం సినిమా ఫేం రుక్సార్ ధిల్లాన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. మరోవైపు ఈ సినిమాను ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది.గతేడాది క సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న కిరణ్ ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే దిల్‌రుబాను విడుదలకు సిద్ధం చేసిన ఈ కుర్ర హీరో ఆ తర్వాత ‘క’ సీక్వెల్ తెరకెక్కించే పనిలో ఉన్నాడు.

# నాన్న అలా అంటాడనుకోలేదు :

హీరోయిన్ కీర్తి సురేశ్ ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల్లో వీరిద్దరి పెళ్లి జరిగింది. 15 ఏళ్ల ప్రేమకథను రోజుకో ఎపిసోడ్‌లాగా కీర్తి పంచుకుంటున్నారు. బేబీజాన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి విశేషాలను పంచుకున్నారు. ముఖ్యంగా క్రిస్టియన్ పద్ధతి గురించి మాట్లాడుతూ.. ఆంటోనీ కుటుంబ ఆచారాలకు అనుగుణంగా ఆ సంప్రదాయం లో పెళ్లి చేసుకున్నామన్నారు. “క్రిస్టియన్ సంప్రదాయంలోనూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాక మా నాన్నతో మాట్లాడాను. ‘నాన్నా.. ఈ సంప్రదాయం ప్రకారం వధువును ఆమె తండ్రి పెళ్లి వేదిక పైకి తీసుకురావాలి. నా కోసం మీరు కూడా ఆ విధంగా చేస్తారా?’ అని అడిగా. ‘తప్పకుండా చేస్తాను. మనం రెండు సంప్రదాయాల్లో వివాహం జరుపుతున్నాం. కాబట్టి నేను కూడా ఆ పద్ధతులు పాటిస్తాను’ అని ఆయన బదులిచ్చారు. ఆ మాట నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను చెప్పిన దానికి ఆయన అంగీకరిస్తారని అసలు ఊహించలేదు. కానీ ఆయన నా కోసం ఆ విధంగా చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది” అని కీర్తి సురేశ్ తెలిపారు. ఇటీవల బేబీజాన్ ఈవెంట్‌కు వెళ్లిన ఆమె పసుపుతాడు (మంగళసూత్రం)తో హాజరు కావడంపై ఆమె స్పందించారు. “దక్షిణాదిలో ఒక సంప్రదాయం ఉంది. పెళ్లి సమయంలో వధువు మెడలో వరుడు పసుపుతాడు కడతాడు. దానిని మేమెంతో పవిత్రంగా భావిస్తాం. పెళ్లైన కొన్ని రోజులకు ఒక మంచి ముహూర్తం చూసి మంగళ సూత్రాలను బంగారు చైన్‌లోకి మార్చుకుంటాం. జనవరి చివరివరకూ మంచి రోజులు లేవు. అప్పటివరకూ నేను ఎక్కడికి వెళ్లినా పసుపు తాడు తో కనిపిస్తాను” అని తెలిపారు. ఆంటోనీ, కీర్తి 15 ఏళ్లగా ప్రేమలో ఉన్నారు. కీర్తి కంటే అతను ఏడేళ్ల పెద్దవాడు. అందరిలాగే రిలేషన్‌లో ఉన్నప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని కీర్తి చెప్పారు. కొవిడ్ సమయంలో కలిసి ఉన్నామని, 2022లో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని కీర్తి అన్నారు. పెద్దల అంగీకారంతో ఈ జంట డిసెంబర్‌లో వివాహబంధంలోకి అడుగుపెట్టింది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో గోవాలో పెళ్లి జరిగింది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492